సాక్షి నిర్మల్

శనివారం । 20 । జూలై । 2024



ఆయకట్టుకు 'కడెం' నీరు

కడెం ప్రాజెక్టు గేట్లు గతేడాది వచ్చిన వరదలకు కొట్టుకుపోయాయి. యాసంగిలో ఆయకట్టుకు క్రాప్ హాలిడే ప్రకటించారు. మరమ్మతులు తర్వాత ప్రాజెక్టు ప్రస్తుతం సిద్ధమైంది. 8లో▸



తండా రోడ్లకు మహర్దశ

ప్రతీ గ్రామాన్ని ఇతర ప్రాంతాలతో అనుసంధానిస్తూ బీటీ రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. దీంతో మారుమూల తండా రోడ్లకు మహర్దశ రానుంది. 9లో▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 27.6 /24.3

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు మరింత తగ్గుతాయి. అల్పపీడనం, రుతుపవనాల ప్రభావంతో జిల్లా అంతటా వర్షం కురుస్తుంది.

న్యూస్‌రీల్

సమీకృత గురుకులం కోసం స్థల పరిశీలన



దేగాంలో స్థలం పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, చిత్రంలో ఆర్డీవో కోమల్‌రెడ్డి

భైంసాటౌన్: సమీకృత గురుకులం ఏర్పాటు కోసం అనువైన స్థలం పరిశీలించాలని అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఆర్డీవో కోమల్‌రెడ్డితో కలిసి పట్టణంలోని పార్డి(బి) మార్గంలో సర్వే నంబర్ 30లోని ప్రభుత్వ స్థలాన్ని శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం కొడంగల్ తరహా అన్ని గురుకులాలు ఒకే ప్రాంగణంలో ఉండేలా నియోజకవర్గానికి ఓ సమీకృత గురుకులం ఏర్పాటు చేయాలని నిర్ణయించిందన్నారు. ఇందుకుగాను 30 ఎకరాల స్థలం అవసరమని తెలిపారు. ఈ మేరకు అనువైన స్థలం పరిశీలిస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే దేగాంతోపాటు ముధోల్‌లో స్థలాలను పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఇతర అధికారులు ఉన్నారు.

హాస్టల్ భవన నిర్మాణానికి స్థల పరిశీలన

ముధోల్: మండల కేంద్రంలోని స్థానిక బాలుర గురుకుల పాఠశాల ఆవరణలో ఇంటిగ్రేటెడ్ హాస్టల్ నిర్మాణానికి అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్ స్థలాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హాస్టల్ భవన నిర్మాణం మంజూరు కావడంతో స్థలాన్ని పరిశీలించినట్లు వెల్లడించారు. ఆయన వెంట ఆర్డీవో కోమల్‌రెడ్డి, తహసీల్దార్ విఠల్, ఆర్ఐ నారాయణ్‌పటేల్ ఉన్నారు.

కళాకారుల ఐక్య వేదిక జిల్లా కమిటీ ఎన్నిక




వెంకటేశ్, అధ్యక్షుడు   రాజేశ్వర్, ఉపాధ్యక్షుడు

కడెం: ఉద్యమ కళాకారుల ఐక్యవేదిక జిల్లా కమిటీని మండల కేంద్రంలో శుక్రవారం ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా కోల వెంకటేశ్, ఉపాధ్యక్షుడిగా కోరుట్ల రాజేశ్వర్, కార్యదర్శిగా భోజన్న, కోశాధికారిగా సురేశ్, సలహాదారులుగా దిగంబర్, రాజేందర్, రాజ్‌కుమార్‌ను ఎన్నుకున్నారు. ఉద్యమ కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలని, సాంస్కృతిక సారథిలో ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు.

ఎస్టీయూ సభ్యత్వ నమోదు



మాట్లాడుతున్న ఎస్టీయూ రాష్ట్ర అసోషియేట్ అధ్యక్షుడు గజేందర్

ముధోల్: మండల కేంద్రం ముధోల్‌తోపాటు మండలంలోని పలు పాఠశాలల్లో శుక్రవారం ఎస్టీయూ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ముధోల్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్ర అసోషియేట్ అధ్యక్షుడు జుట్టు గజేందర్ మాట్లాడారు. ఏకీకృత సర్వీస్‌రూల్స్ సాధించే వరకూ పోరాటం చేస్తామన్నారు. అర్హులైన ఉపాధ్యాయులకు జూనియర్ లెక్చరర్లు, ఎంఈవో, డిప్యూటీ ఈవో, డైట్ లెక్చరర్ల పదోన్నతులకు సంబంధించి ప్రభుత్వంతో మాట్లాడుతామన్నారు. ఎస్టీయూ ఉపాధ్యాయుల హక్కుల పరిరక్షణకు పోరాడుతుందన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ ప్రతినిధులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతో వ్యాధులు దూరం



అవగాహన కార్యక్రమంలో వీవోఏలు, ఐకేపీ సిబ్బంది

కడెం: పరిశుభ్రతతో వ్యాధులు దరిచేరవని మహిళా అభివృద్ధి సొసైటీ హైదరాబాద్ ప్రాజెక్ట్ మేనేజర్ ఆర్.బ్రహ్మాచారి తెలిపారు. మండల కేంద్రంలోని మహిళా సంఘ కార్యాలయంలో పరిశుభ్రతపై వీవోఏలకు శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత, మరుగుదొడ్ల వినియోగం తదితర విషయాలపై ప్రతీ మహిళ సంఘాల్లో తప్పక అవగాహన కల్పించాలన్నారు. ఇందులో మహిళా అభివృద్ధి సంస్థ జిల్లా సమన్వయకర్త ప్రవీణ్, ఏపీఎం రాజారాం, సిబ్బంది లింగన్న, వీవోలు విక్రమ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ కంట్రోల్‌కు మాస్టర్ ప్లాన్!

- పాఠశాలల్లో 'ప్రహరీ క్లబ్'లు
- సభ్యులుగా చురుకైన విద్యార్థులు
- వినియోగదారులపై ప్రత్యేక నిఘా
- ఆదేశాలు జారీ చేసిన విద్యాశాఖ



డ్రగ్స్ నియంత్రణపై ఇటీవల నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న వివిధ పాఠశాలల విద్యార్థులు

నిర్మల్ రూరల్: ప్రభుత్వం డ్రగ్స్ నియంత్రణపై ప్రత్యేక నిఘా పెట్టింది. ముఖ్యంగా విద్యార్థులు మాదకద్రవ్యాల బారినపడి తమ భవిష్యత్తును బుగ్గిపాలు చేసుకుంటున్నట్లు గుర్తించింది. కాలేజీల నుంచి పాఠశాలలకు సైతం ఈ జాడ్యం పాకింది. ఈ నేపథ్యంలో పాఠశాలల్లో మాదకద్రవ్యాల నియంత్రణకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. విద్యార్థులను కాపాడేందుకు ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేయాలని పాఠశాల విద్యాశాఖను సర్కారు ఆదేశించింది. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ ఉన్నత పాఠశాలలో మాదకద్రవ్యాల వాడకంపై ప్రత్యేక నిఘా పెట్టి, విద్యార్థులను వాటికి దూరం చేయాలని సూచించింది. ఇందుకు 'ప్రహరీ క్లబ్' లు ఏర్పాటు చేయాలని పాఠశాల విద్యాశాఖ ఈనెల 12న జీవో 20 ప్రకారం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఉన్నత పాఠశాలలో పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు డీఈవో రవీందర్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. జిల్లా వ్యాప్తంగా 200 స్కూళ్లలో ఈ క్లబ్‌లు ఏర్పాటు చేసే అవకాశం ఉంది.

కమిటీ ఏర్పాటు ఇలా...

జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు ఉన్నత పాఠశాలల్లో 40 వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. పాఠశాలల్లో ఏర్పాటు చేసే ప్రహరీ క్లబ్‌లకు ఆయా పాఠశాల హెచ్‌ఎంలు అధ్యక్షులుగా ఉంటారు. ఉపాధ్యక్షుడిగా పాఠశాల సీనియర్ ఉపాధ్యాయుడు లేదా విద్యార్థులతో సాన్నిహిత్యం ఉన్న ఉపాధ్యాయుడిని నియమిస్తారు. ఇక 6 నుంచి 10వ తరగతి వరకు తరగతికి ఇద్దరు చొప్పున చురుకైన విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సంఘం నుంచి ఒకరు, స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి ఒకరు సభ్యులుగా ఉంటారు. ఈ కమిటీలో మొత్తం 16 మంది సభ్యులు ఉంటారు. వీరంతా విద్యార్థులు మాదకద్రవ్యాల బారిన పడకుండా శ్రద్ధ తీసుకుంటారు. ఈ కమిటీలు చురుకుగా పని చేసేందుకు పోలీసులు ఎన్ఎస్ఎస్ వలంటీర్ల సహకారం తీసుకుంటారు. క్లబ్‌ల నిర్వహణకు సంబంధించి త్వరలో మరిన్ని మార్గదర్శకాలు విడుదల చేస్తామని ఉత్తర్వుల్లో వెల్లడించారు.

హెచ్‌ఎంలకు ఆదేశాలు..



"జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ ఉన్నత పాఠశాలల్లో ప్రహరీ క్లబ్‌లు ఏర్పాటు చేయాలని పాఠశాలల హెచ్‌ఎంలకు విద్యాశాఖ నుంచి ఆదేశాలు ఇచ్చాం. పాఠశాలల్లో మాదకద్రవ్యాల వినియోగం ఎట్టి పరిస్థితుల్లో సహించేది లేదు. కఠిన చర్యలు తీసుకుంటాం. క్లబ్ ఏర్పాటు పూర్తయిన అనంతరం, వచ్చిన మార్గదర్శకాల ప్రకారం చర్యలు తీసుకుంటాం. విద్యార్థులు మాదకద్రవ్యాలకు అలవాటు పడకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉంది."

– రవీందర్‌రెడ్డి, డీఈవో

కమిటీ లక్ష్యాలు..

- విద్యార్థులు మాదకద్రవ్యాల బారిన పడకుండా నిఘా పెట్టడం
- పాఠశాలలో విద్య, శిశు సంరక్షణ సంస్థల పరిసర ప్రాంతాల్లో మాదకద్రవ్యాల అమ్మకాలను అరికట్టడం.
- మాదకద్రవ్యాలకు సరఫరా అలవాటు పడిన విద్యార్థులు ఉంటే వారిని గుర్తించి అప్రమత్తం చేసి వాటి దుష్ప్రభావాలు వివరించి మాన్పించడం.
- వీటి అక్రమ రవాణాకు పిల్లల్ని ఉపయోగిస్తే తగిన చర్యలు, జాగ్రత్తలు తీసుకుని కట్టడి చేయడం.
- పాఠశాల ఆవరణలో, చుట్టుపక్కల మాదకద్రవ్యాల వినియోగం, అమ్మకం, అనుమానిత కార్యకలాపాలపై అప్రమత్తంగా ఉండడం.
- విద్యార్థులు డ్రగ్స్ ఊబిలో చిక్కుకోకుండా చక్కని ప్రణాళికలు రూపొందించి అమలు చేయడం.
- పిల్లలు మత్తు పదార్థాలుగా ఉపయోగించే ఔషధాలు, పదార్థాలు, ఇతర రకాల వస్తువులు వారి దరిచేరకుండా నిరోధించడం.

సాక్షి స్పెల్‌బీ, మ్యాథ్ బీ, చిన్నారుల ప్రతిభకు పట్టం

సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ పోటీలకు పాఠశాలల వారీగా రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చు.

రిజిస్ట్రేషన్స్ చివరి తేదీ జులై 31, 2024

కేటగిరీ-1లో 1,2 తరగతులు, కేటగిరీ-2లో 3,4 తరగతులు, కేటగిరీ-3లో 5,6,7 తరగతులు, కేటగిరీ-4లో 8,9,10 తరగతుల వారికి. కేటగిరీల వారీగా బహుమతులతో పాటు చాంపియన్ స్కూల్ ట్రోఫీ, విజేతలకు మెడల్స్, పాల్గొన్న విద్యార్థులందరికీ పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు అందజేస్తారు.



సాక్షి స్పెల్‌బీకి నాలుగు రౌండ్లు, నాలుగు కేటగిరీలు మొదటి రౌండ్ పాఠశాల ద్వారా రిజిస్టర్ చేసుకున్న వారికి ప్రిలిమినరీ పోటీలు పాఠశాలలోనే జరుగుతాయి. రాతపూర్వకంగా రెండో రౌండ్ (క్వార్టర్ ఫైనల్స్) మూడో రౌండ్ (సెమీ ఫైనల్స్) నాలుగో రౌండ్ ఫైనల్స్ మౌఖిక పరీక్ష జరుగుతాయి.



సాక్షి మ్యాథ్ బీకి మూడు రౌండ్లు, నాలుగు కేటగిరీలు మొదటి రెండు రౌండ్లు పాఠశాల ద్వారా రిజిస్టర్ చేసుకున్న వారికి ప్రిలిమినరీ పోటీలు పాఠశాలలో జరుగుతాయి. రాతపూర్వకంగా రెండో రౌండ్‌లో సెమీ ఫైనల్స్, మూడో రౌండ్ ఫైనల్స్ మౌఖిక పరీక్ష జరుగుతాయి. మొదటి రౌండ్ తప్ప మిగతా రౌండ్స్ సాక్షి నిర్ణయించిన వేదికల్లో జరుగుతాయి.

విజేతలకు ఆకర్షణీయమైన బహుమతులు అందజేస్తారు | రిజిస్ట్రేషన్ ఫీజు రూ. 250. మరిన్ని వివరాల కోసం.. (ఉ.10 గం.ల నుంచి సా. 6 గం.ల మధ్య సంప్రదించగలరు)

www.arenaoneschoolfest.com వెబ్‌సైట్లో సంప్రదించవచ్చు.
040- 23256134 / 9505551099 / 9705199924 కు కాల్ చేయవచ్చు.

మున్సిపల్ కమిషనర్లతో నేడు 'సాక్షి' ఫోన్‌ఇన్

భైంసా టౌన్/ఖానాపూర్: వర్షాకాలం.. వ్యాధుల కాలం. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు వ్యాధులు ముసురుకునే ప్రమాదం ఉంది. వర్షపు నీరు నిలిచి దోమలు వృద్ధి చెందే అవకాశముంది. డెంగీ, మలేరియాతోపాటు ఇతర వ్యాధులు సోకే ప్రమాదముంది. ఈ నేపథ్యంలో మున్సిపల్ ఆధ్వర్యంలో చేపడుతున్న పారిశుధ్య పనులు, పట్టణ ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై భైంసా మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ సుదర్శన్‌రెడ్డి, ఖానాపూర్ మున్సిపాలిటీ కమిషనర్ మనోహర్‌తో శనివారం ఫోన్‌ఇన్ కార్యక్రమంలో మాట్లాడవచ్చు.

అంశం: పారిశుధ్య నిర్వహణ, సీజనల్ వ్యాధుల నియంత్రణకు చర్యలు

భైంసా



మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ సుదర్శన్‌రెడ్డి

సమయం : శనివారం ఉదయం 10.30 నుంచి 11.30 గంటల వరకు

95151 21070

ఖానాపూర్



మున్సిపల్ కమిషనర్ మనోహర్

సమయం : మధ్యాహ్నం 12:00 నుంచి 1:00 వరకు

85000 23363

సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు

కేజీబీవీలలో సౌకర్యాలు కల్పించాలి

- కలెక్టర్ అభిలాష అభినవ్



మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్‌చైన్‌గేట్: కస్తూరిబాగాంధీ విద్యాలయాల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. కేజీబీవీల్లో కల్పిస్తున్న సౌకర్యాలపై ప్రిన్సిపాళ్లు, ప్రత్యేకాధికారులతో శుక్రవారం కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. మండలాల వారీగా కేజీబీవీలలో విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు, సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలు తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రత్యేకాధికారులు నిరంతరం కేజీబీవీలను తనిఖీ చేయాలన్నారు. సమస్యలను గుర్తించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. తనిఖీలకు సంబంధించిన సమాచార నివేదికలను అందజేయాలన్నారు. మధ్యాహ్న భోజనాన్ని రుచి చూసి, నాణ్యత తెలుసుకోవాలని పేర్కొన్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం, అల్పాహారం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. వంటగదిని ప్రతిరోజూ పరిశుభ్రంగా ఉంచాలని, వంటకు నాణ్యమైన కూరగాయలు, వస్తువులు వాడాలన్నారు. కిచెన్ గార్డెన్లను నిర్వహించాలని, ప్రతీ కేజీబీవీలో రక్షణ గోడ, తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్, మెరుగైన డ్రైనేజీ వ్యవస్థ లాంటి సౌకర్యాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పాఠశాలల్లో అన్ని రకాల కమిటీలను ఏర్పాటు చేసి విద్యార్థులను భాగస్వాములను చేయాలని సూచించారు. వర్షాకాలం నేపథ్యంలో దోమలు వ్యాప్తి చెందకుండా చుట్టుపక్కల ప్రాంతాల్లో మురుగు నీరు నిల్వకుండా చర్యలు చేపట్టాలని, ఫాగింగ్, ఆయిల్ బాల్స్ వేయాలన్నారు. వైద్య శిబిరాలు నిర్వహించాలని, ప్రతీ కేజీబీవీలో అనారోగ్యంబారిన పడిన విద్యార్థులకు ప్రత్యేక గది ఏర్పాటుచేయాలని పేర్కొన్నారు. ప్రతీ కేజీబీవీలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, నిరంతరం పర్యవేక్షించాలన్నారు. విద్యార్థులకు మెరుగైన విద్య బోధన చేయాలని తెలిపారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, డీఈవో రవీందర్‌రెడ్డి, ప్రత్యేక అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

- భైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్



మాట్లాడుతున్న ఏఎస్పీ అవినాష్‌కుమార్

కుభీర్: నూతన చట్టాలపై అందరూ అవగాహన కలిగి ఉండాలని భైంసా ఏఎస్పీ అవినాష్‌కుమార్ సూచించారు. మండలంలోని పార్డి(బి) గ్రామంలో శుక్రవారం నేరాలపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఏఎస్పీ హాజరై మాట్లాడారు. నూతన చట్టాల గురించి వివరించారు. గ్రామంలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొందరు యువకులు ఉపాధి అవకాశాలు లేవన్నారు. అదేవిధంగా పోలీసులు అకారణంగా కేసులు పెడుతున్నారని తెలిపారు. గ్రామంలో భూసమస్యల గురించి వివరించారు. వీటికి ఏఎస్పీ సమాధానం ఇచ్చారు. ఉపాధి అవకాశాల కోసం పోలీసు శాఖ తరఫున స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమం ఏర్పాటు చేస్తామని తెలిపారు. అకారణంగా ఎవరిపైనా కేసులు పెట్టడం జరగదని తెలిపారు. ఏదైనా ఇబ్బంది ఉంటే తనకు ఫోన్ చేసి చెప్పాలని సూచించారు. భూసమస్యలు తమ పరిధిలో ఉండవని తెలిపారు. కొందరు ఆకతాయిలు అకారణంగా 100కు ఫోన్ చేస్తున్నారన్నారు. అలాంటివారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలు పాటించాలని సూచించారు. మద్యం తాగి వాహనాలు నడుపొద్దని పేర్కొన్నారు. మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే తల్లిదండ్రులపై కేసు నమోదు చేస్తామని తెలిపారు. సమావేశంలో సీఐ నైలు, మాజీ సర్పంచ్ వి.మోహన్, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

సెత్వారీ సమస్య పరిష్కరించండి



వినతిపత్రం ఇస్తున్న న్యూవెల్మల్ గ్రామస్తులు

సోన్: మండలంలోని న్యూవెల్మల్ గ్రామానికి చెందిన సెత్వారీ రైతులు, గ్రామస్తులు గ్రామాభివృద్ధి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావును శుక్రవారం నిర్మల్‌లోని ఆయన నివాసంలో కలిసి కలిశారు. గ్రామంలోని సెత్వారీ సమస్యను పరిష్కరించాలని విన్నవించారు. ఈ సందర్భంగా వీడీసీ సభ్యులు మాట్లాడుతూ న్యూవెల్మల్ గ్రామం 45 ఏళ్ల క్రితం శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో ముంపునకు గురైందన్నారు. అప్పటి నుంచి తమ భూములకు సెత్వారీ కాలేదని తెలిపారు. దీంతో రైతుబంధు(రైతు భరోసా), రైతుబీమా, బ్యాంక్ రుణాలు పొందలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో కలెక్టర్‌కు, అప్పటి మంత్రి ఐకే. రెడ్డికి సమస్యపై విన్నవించినా పరిష్కారం కాలేదని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక హైదరాబాద్ ప్రజావాణిలో కూడా ఫిర్యాదు చేశామన్నారు. తమ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. స్పందించిన శ్రీహరి రావు సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వినతిపత్రం ఇచ్చినవారిలో వీడీసీ చైర్మన్ రోడ్ద రాజేశ్వర్, కోశాధికారి గజ్జల గంగాధర్, కాంగ్రెస్ నాయకులు గడ్డం స్వామి, పెద్ద లక్ష్మణ్, గౌస్, చిన్నయ్య, రైతులు నర్సింగ్‌రావు, కిషన్, భూమేశ్, నర్సయ్య, కొండ రవి తదితరులు పాల్గొన్నారు.

వీఆర్‌ఏలపై 'కారుణ్య'ం చూపండి

నిర్మల్‌చైన్‌గేట్: వీఆర్‌ఏలుగా 61 ఏళ్ల వయసు దాటిన వారి వారసులకు కారుణ్య నియామకం కింద ఉద్యోగాలు ఇవ్వాలని వీఆర్‌ఏల సంఘం ప్రతినిధులు కోరారు. ఈమేరకు డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావుకు వినతిపత్రం అందజేశారు. జిల్లాలో 3,797 మంది 61 ఏళ్లు నిండిన వీఆర్‌ఏలు ఉన్నారని తెలిపారు. వారి వారసులకు ఉద్యోగాలు ఇచ్చి కుటుంబాలను ఆదుకోవాలని కోరారు.

వైద్యారోగ్యశాఖలో బదిలీల గుబులు..!



భైంసా ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి

- రెండు రోజులుగా కౌన్సెలింగ్
- నేటితో ముగింపు..

భైంసా ఏరియాస్పత్రిలో ఇలా..

పోస్టు	మంజూరు	భర్తీ	బదిలీకి అర్హులు
సివిల్ స్పెషల్ సర్జన్	13	08	04
డిప్యూటీ సివిల్ సర్జన్	10	02	01
సివిల్ అసిస్టెంట్ సర్జన్	22	04	03
డెంటల్ అసిస్టెంట్ సర్జన్	01	01	01
స్టాఫ్ నర్స్	26	20	01
ఎంపీహెచ్ఏ(పి)	04	02	01
ఆఫీస్ సూపరింటెండెంట్	01	01	01
సీనియర్ అసిస్టెంట్	02	01	01
జూనియర్ అసిస్టెంట్	02	01	01
గ్రేడ్-1 ఫార్మాసిస్ట్	01	01	01
ఎంఎన్‌వో/ఎఫ్ఎన్‌వో	05	05	02
జేఎస్‌డబ్ల్యూ	04	03	02
వాచ్‌మెన్	01	01	01
మొత్తం	92	50	20

భైంసాటౌన్: వైద్యారోగ్యశాఖలో బదిలీల ప్రక్రియ కొనసాగుతోంది. ఇందులో భాగంగా ఆయా ఆస్పత్రుల్లో నాలుగేళ్లకుపైబడి సర్వీసు పూర్తి చేసుకున్న వైద్యులతోపాటు మినిస్ట్రీయల్, పారామెడికల్, నర్సింగ్ సిబ్బంది, నాలుగో తరగతి ఉద్యోగులకు స్థానచలనం కల్పించనుంది. ఈనెల 18 నుంచి 20 వరకు హైదరాబాద్‌లో కౌన్సెలింగ్ కొనసాగనుంది. 25లోగా బదిలీల ప్రక్రియ కొలిక్కి రానుంది. ఈ నేపథ్యంలో భైంసాలోని ప్రభుత్వ ఏరియాస్పత్రి నుంచి భారీగానే వైద్యులు, ఉద్యోగులు బదిలీ కానున్నారు. కాగా, కొందరు వైద్యులు కొన్నేళ్లుగా స్థానికంగా స్థిరపడ్డారు. దీంతో వీరిలో బదిలీలపై దాదాపు విముఖత కనిపిస్తోంది. బదిలీలు రాష్ట్రస్థాయి, మల్టీజోన్ స్థాయిలోనే కావడంతో వారిలో ఆందోళన మొదలైంది. మల్టీజోనల్ పరిధిలోని ఎక్కడికి వెళ్లాల్సి వస్తుందోనని ఆందోళన చెందుతున్నారు.

40 శాతంతో ఉపశమనమా..లేదా..?

ఒకేచోట నాలుగేళ్లకు పైబడి సర్వీసు పూర్తిచేసుకున్న వారిని వైద్యారోగ్య శాఖ బదిలీ చేస్తోంది. అందులోనూ 40 శాతం మేర మాత్రమే స్థానచలనం కల్పించనుంది. అంటే భైంసా ఏరియాస్పత్రిలో 50 మంది బదిలీకి అర్హత ఉన్నవారిలో ఆయా కేటగిరీల వారీగా 40 శాతం మేర మాత్రమే బదిలీ కానున్నారు. దీంతో ఈ నిర్ణయం ఉపశమనమా.. లేక.. శరాఘాతమా అని ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. ఎందుకంటే ప్రస్తుతం భైంసా ఏరియాస్పత్రిలో పదేళ్లకుపైబడి పనిచేస్తున్నవారున్నారు. దీంతో 40 శాతం బదిలీల్లో తమ పేరు ముందుంటుందన్న ఆందోళన నెలకొంది. వీరిలో కొందరు స్థానికంగా ప్రైవేట్ ఆస్పత్రులు నిర్వహిస్తున్నారు. ఒకవేళ బదిలీ అయితే, వెళ్తారా.. లేదా అన్న చర్చ జరుగుతోంది. ఏదేమైనా రెండురోజుల్లో కౌన్సెలింగ్ ప్రక్రియ తరువాత బదిలీలపై స్పష్టత రానుంది.

'స్థానిక'ంగా బలోపేతం కావాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు అంజుకుమార్‌రెడ్డి



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: రానున్న స్థానిక సంస్థల్లో గెలుపే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త పనిచేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు అంజుకుమార్‌రెడ్డి సూచించారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పార్టీ జిల్లా కార్యవర్గ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ముధోల్ ఎమ్మెల్యే రామారావుపటేల్, ఆదిలాబాద్ పార్లమెంట్ ప్రభారి అల్జాపూర్ శ్రీనివాస్ హాజరయ్యారు. తెలంగాణలో భారతీయ జనతా పార్టీపై ప్రజల్లో నమ్మకం పెరిగిందన్నారు. ఇక స్థానిక సంస్థల ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పని చేయాలని సూచించారు. పంచాయతీ, మండల, జిల్లా పరిషత్, మున్సిపల్ ఎన్నికల్లో మెజార్టీ స్థానాల్లో బీజేపీ విజయం సాధించాలన్నారు. ఇందుకోసం స్థానిక సమస్యలపై ప్రజల తరఫున పోరాటం చేయాలని సూచించారు. కార్యక్రమంలో పార్లమెంట్ కన్వీనర్ అయ్యన్నగారి భూమయ్య, రాష్ట్ర నాయకులు రావుల రాంనాథ్, జిల్లా ప్రధాన కార్యదర్శులు సామ రాజేశ్వర్‌రెడ్డి, మెడిసమ్మె రాజు, పడిపెల్లి గంగాధర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గోపాల్ సర్డ, గంగారెడ్డి, రవి పాండే, హరి నాయక్, మాజీ జెడ్పీటీసీ రమణారెడ్డి, రమేశ్, ఎంపీపీలు రామారావు, రమేశ్, జిల్లా పదాధికారులు, అసెంబ్లీ కన్వీనర్లు, మండల అధ్యక్షులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వ్యక్తిగత శుభ్రత పాటించాలి


విద్యార్థినులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఇంద్రవెల్లి: వసతిగృహాల విద్యార్థులు వ్యక్తిగత శుభ్రత పాటించి, ఆరోగ్యంపై దృష్టి సారించాలని ఏజెన్సీ అదనపు జిల్లా అధికారి కుడ్మెత మనోహర్ సూచించారు. శుక్రవారం మండలకేంద్రంలోని ఆశ్రమ బాలికల వసతి గృహంలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థినుల ఆరోగ్య వివరాలు తెలుసుకున్నారు. వసతి గృహం, పరిసర ప్రాంతాల్లో దోమల నివారణ మందు స్ప్రే చేయించారు. జ్వరాలతో బాధపడుతున్న విద్యార్థినులను గుర్తించి వైద్యపరీక్షలు చేశారు. ఇంద్రవెల్లి ప్రభుత్వ ఆస్పత్రి వైద్యాధికారి శ్రీకాంత్, హెచ్ఈవో తులసీరాం, సిబ్బంది జాదవ్ శ్రీనివాస్, గోకుల్, ఆశ తదితరులున్నారు.

గుట్కా విక్రేత అరెస్ట్

నేరడిగొండ: మండల కేంద్రంలో గుట్కా విక్రయించేందుకు వచ్చిన వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని జలగావ్‌కు చెందిన వినోద్ కుక్రేజా గురువారం మధ్యాహ్నం నిర్మల్ జిల్లా నుంచి ద్విచక్ర వాహనంపై వస్తున్నాడు. వాంకిడి బస్టాప్ వద్ద ఇతడిని ఆపి తనిఖీ చేయగా రూ.15,410 విలువైన నిషేధిత గుట్కా లభ్యమైంది. సదరు వ్యక్తి ఆ గుట్కాను నేరడిగొండకు అమ్మడానికి తీసుకురాగా వాంకిడి బస్టాప్ వద్ద పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

గుట్కా పట్టివేత

బోథ్: మండల కేంద్రంతో పాటు సొనాల గ్రామంలో శుక్రవారం నిషేధిత గుట్కాను పట్టుకున్నట్లు బోథ్ ఎస్సై రాము తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. పలు దుకాణాల్లో గుట్కా విక్రయిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు దాడులు నిర్వహించినట్లు పేర్కొన్నారు. బోథ్ మండల కేంద్రంలోని పలు షాపుల్లో రూ.26,318, సొనాలలో రూ.8,400 విలువైన గుట్కా ప్యాకెట్లను పట్టుకున్నట్లు ఎస్సై తెలిపారు. గుట్కా విక్రయిస్తున్న వారిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

గంజాయి విక్రయిస్తే జైలుకే..


నిందితులకు కౌన్సెలింగ్ ఇస్తున్న డీసీపీ

మంచిర్యాలక్రైం: గంజాయి విక్రయించినా, వినియోగించినా జైలుశిక్ష తప్పదని డీసీపీ ఎగ్గడి భాస్కర్ హెచ్చరించారు. జిల్లాలో గంజాయి సేవించిన, రవాణా చేసిన, విక్రయించిన కేసుల్లో నిందితులైన సుమారు 100మందిని డీసీపీ కార్యాలయానికి శుక్రవారం పిలిపించి ఆయా స్టేషన్ల ఎస్సైలు, సీఐల సమక్షంలో వారి కుటుంబ సభ్యుల ఎదుట కౌన్సెలింగ్ నిర్వహించారు. నిందితులపై హిస్టరీ షీట్ నమోదు చేసి వీరిపై రోజూ ప్రత్యేక దృష్టి సారించాలని పోలీస్ అధికారులకు సూచించారు. ఆయన మాట్లాడుతూ.. నిందితులంతా ఇకనైనా పద్ధతి మార్చుకోవాలని పేర్కొన్నారు. ఎన్‌డీపీఎస్ కేసుల్లో ఉన్న నేరస్తుల కదలికలను గమనించేందుకు జిల్లాలో ప్రత్యేక బృందం 24/7 పని చేస్తుందని తెలిపారు. పద్ధతి మార్చుకోకుంటే పీడీ యాక్ట్ కూడా నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కేసుల్లో రెండేళ్ల బెయిల్ రాకుండా జైలుశిక్ష ఉంటుందని తెలిపారు. నిందితుల పేరుతో ఉన్న వాహనాలను సీజ్ చేయనున్నట్లు పేర్కొన్నారు. నిందితులు మారి ఇకపై ఎక్కడ గంజాయి రవాణా జరిగినా సమాచారం ఇవ్వాలని కోరారు. టోల్ ఫ్రీ 1446 లేదా 87126 71111 నంబర్లకు సమాచారం ఇచ్చినవారి పేర్లు గోప్యంగా ఉంచనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏసీపీలు ప్రకాశ్, రవికుమార్, సీఐలు బన్సిలాల్ అశోక్, నరేందర్, ఎస్సైలు పాల్గొన్నారు.

ఆయకట్టుకు 'కడెం' నీరు




ఆయకట్టు కింద దుక్కి దున్నుతున్న రైతులు

- నేడో, రేపో విడుదల చేసే అవకాశం
- 690 అడుగులకు చేరిన ప్రాజెక్టు నీటిమట్టం
- సాగుకు సిద్ధమవుతున్న రైతులు

కడెం: నిర్మల్ జిల్లాలో ప్రాధాన సాగునీటి ప్రాజెక్టు కడెం. గతేడాది వచ్చిన వరదలతో గేట్లు కొట్టుకుపోవడంతో యాసంగి ఆయకట్టు రైతులు క్రాప్ హాలిడే ప్రకటించారు. అయితే మరమ్మతులు తర్వాత ప్రాజెక్టు ప్రస్తుతం సిద్ధమైంది. ఎగువను కురుస్తున్న వర్షాలతో ప్రాజెక్టులోకి వరద వస్తోంది. దీంతో క్రమంగా ప్రాజెక్టులో నీటిమట్టం పెరుగుతోంది. ఆయకట్టు ఆశాజనకంగా ఉంది. దీంతో వానాకాలం సాగుకు రైతులు సిద్ధమవుతున్నారు.

690 అడుగులకు నీరు..

కడెం ప్రాజెక్టు పూర్తి నీటిమట్టం 700(7.603టీఎంసీ)అడుగులు కాగా, ప్రస్తుతం 690 అడుగులకు చేరింది. దీంతో ఆయకట్టు కాలువలకు సాగు నీటిని విడుదల చేసేందుకు నీటిపారుదల శాఖ అధికారులు సిద్ధమవుతున్నారు. ఈమేరకు కాలువలను పరిశీలిస్తున్నారు. ఒకటి రెండు రోజుల్లో కాలువల ద్వారా ఆయకట్టుకు నీటిని విడుదల చేసే అవకాశం ఉంది.

రెండు జిల్లాల వరప్రదాయిని

కడెం ప్రాజెక్టు నిర్మల్, మంచిర్యాల జిల్లాల వరప్రదాయిని. కడెం ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువల ద్వారా కడెం, దస్తురాబాద్, జన్నారం, దండేపల్లి, లక్సెట్టిపేట, హాజీపూర్ మండలాల్లోని 68,150 ఎకరాలకు సాగు నీటిని అందిస్తుంది. ఆయకట్టు కింద వరి ఎక్కువగా సాగు చేస్తుంటారు. కాలువల లైనింగ్ దెబ్బతినడం, పలు చోట్ల గండ్లు పడడంతో చివరి వరకు సక్రమంగా సాగునీరు అందడం లేదని రైతులు పేర్కొంటున్నారు. కాలువలకు పూర్తిస్థాయి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

నేడో, రేపో కడెం నీటి విడుదల

కడెం ప్రాజెకునీటిమట్టం 690 అడుగులకు చేరడంతో ముందస్తుగానే కుడి, ఎడమ కాలువల ద్వారా ఆయకట్టుకు నీటిని విడుదల చేసేందుకు అధికారులు అధికారులు సిద్ధమయ్యారు. ప్రాజెక్టులో నిండా నీరున్నా.. గతే ఏడాది భారీ వరదలతో కాలువలు దెబ్బతినడంతో, ఆగస్టు నెలలో ఆయకట్టుకు నీటిని విడుదల చేశారు. ఈఏడాది ప్రాజెక్టులో ఆలస్యంగా నీటిమట్టం పెరిగింది. ప్రస్తుతం ఆయకట్టు కింద నార్లు పోయగా, ఆయా మండలాల్లో చెరువులు, కుంటలు ఇంకా నిండాలేదు. దీంతో ఉన్న నీటిని ముందస్తుగా కాలువలకు విడుదల చేసి చెరువులు, కుంటలు నింపాలని నీటి పారుదల శాఖ అధికారులు భావిస్తున్నారు.

మరమ్మతులు పూర్తి..

రెండేళ్లుగా వరదలతో దెబ్బతిన్న కడెం ప్రాజెక్టు మరమ్మతులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.9.26 కోట్లు కేటాయించింది. దీంతో వరద గేట్ల మరమ్మతులు చేపట్టారు. వరద గేట్లకు కౌంటర్ వెయిట్‌లు, మోటార్లు, రబ్బర్ సీల్స్, బేరింగ్‌లు, వీల్స్, రోప్స్ తదితర నూతన విడి భాగాలను అమర్చారు. మరమ్మతులు పూర్తయిన వరద గేట్లకు పలుమార్లు ట్రయల్ రన్ చేశారు. ప్రాజెక్టును ఇటీవలే కలెక్టర్ అభిలాష అభినవ్, సీఈ శ్రీనివాస్ సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

సంతోషంగా ఉంది



కడెం జలాశయం నిండడం సంతోషంగా ఉంది. గతేడాది నీటి విడుదల ఆలస్యమవడం, యాసంగి పంటలకు క్రాప్ హాలిడే ప్రకటించడంతో పంటలు సాగు చేపట్టలేకపోయాం. ఈ ఏడాది రెండు పంటలకు నీరందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– విష్ణు, రైతు, జన్నారం

నీటిని విడుదల చేస్తాం



కడెం ప్రాజెక్టు నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. ప్రస్తుతం నీటి నిల్వలు ఆశాజనకంగా ఉన్నాయి. నీటిమట్టం 690 అడుగులు దాటగానే చెరువులు, కుంటలు నింపేందుకు కుడి, ఎడమ కాలువల ద్వారా నీటిని విడుదల చేస్తాం.

– బోజదాసు, డీఈ, కడెం ప్రాజెక్టు

చెరువు నింపాలి



వరినార్లు పోశాం. చెరువులు ఇంకా నిండలేదు. కడెం ప్రాజెక్టు కుడి కాలువకు నీటిని విడుదల చేయాలి. లేదంటే నాట్లు ఆలస్యమవుతాయి. కాలువలకు నీటిని విడుదల చేయడంతో చెరువులు నిండుతాయి.

– రహీల్, రైతు, పెద్దబెల్లాల్, కడెం

రిమ్స్‌లో అరుదైన శస్త్రచికిత్స

- పెద్ద పేగు తొలగింపు


శస్త్రచికిత్స విజయవంతంగా నిర్వహించిన వైద్యులు

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్ వైద్యులు అరుదైన శస్త్రచికిత్స చేసి ఓ ప్రాణాన్ని కాపాడారు. గుడిహత్నూర్ మండలం మచ్చాపూర్ గ్రామానికి చెందిన పవార్ కృష్ణ రెండేళ్లుగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. అప్పుడప్పుడు విరోచనంలో రక్తస్రావం అవుతుండడంతో ఇబ్బంది పడుతున్నాడు. హైదరాబాద్‌తో పాటు పలు ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకున్నా నయం కాలేదు. ఇటీవల రిమ్స్ ఆస్పత్రి వైద్యులను సంప్రదించాడు. వైద్యులు పరీక్షలు నిర్వహించి పెద్ద పేగులో దాదాపు వందకు పైగా చిన్నచిన్న గడ్డలున్నట్లు గుర్తించారు. ఆయన క్యాన్సర్ బారినపడినట్లు, ప్యామిలీయల్ ఆడినో మ్యాటర్ పాలిప్ అనే వ్యాధి ఉన్నట్లు నిర్ధారించారు. శస్త్రచికిత్స ద్వారా పెద్దపేగు తొలగించాలని రిమ్స్ సర్జన్ విభాగం హెచ్‌వోడీ ప్రొఫెసర్ శిరీశ్ సూచించారు. గురువారం శస్త్రచికిత్స చేసి పేగు తొలగించారు. ఏడుగురు వైద్యులతో కూడిన బృందం నాలుగు గంటల పాటు శ్రమించి శస్త్రచికిత్సను విజయవతంగా పూర్తి చేశారు. ప్రస్తుతం కృష్ణ ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. చికిత్స చేసిన వారిలో వైద్యులు దుర్గాగణేశ్, అప్సా శిరీన్, శ్రీనివాస్, సుప్రియ, శరత్, వెంకటేశ్, సతీశ్, ముని తదితరులున్నారు.

బాసరలో గురుపౌర్ణమి వేడుకలు ప్రారంభం


వేడుకలకు హాజరైన ఎమ్మెల్యే రామారావుపటేల్

బాసర: బాసర జ్ఞానసరస్వతీ అమ్మవారి ఆలయంలో శుక్రవారం గురుపౌర్ణమి వేడుకలు ప్రారంభమయ్యాయి. వేకువజామున సరస్వతి, మహాలక్ష్మి, మహాకాళి అమ్మవార్లకు విశేష అభిషేకం, అర్చన పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి సన్నిధిలో ఉదయం 9గంటలకు ప్రత్యేకపూజలు, హోమం జరిపించారు. వేదవ్యాస మహర్షి ఆలయంలోనూ ప్రత్యేకపూజలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ హాజరయ్యారు. అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

మద్యం వద్దని తండ్రి మందలిస్తే..

- మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య


విశాల్

తలమడుగు: మద్యం తాగొద్దని తండ్రి మందలించగా యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని లక్ష్మీంపూర్ గ్రామపంచాయతీ పరిధి బూరుగుపల్లి గ్రామానికి చెందిన ఆత్రం విశాల్ (18) రెండేళ్లుగా మద్యం తాగుతూ బానిసయ్యాడు. విశాల్ శుక్రవారం మద్యం తాగి ఇంటికి రాగా తండ్రి మందలించాడు. దీంతో మనస్తాపం చెందిన విశాల్ మద్యం మత్తులో పురుగుల మందు తాగి పడిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స కోసం జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించగా అప్పటికే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌చార్జి ఎస్సై సురేందర్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వాచర్‌కు గాయాలు


సాగర్‌ను ఆస్పత్రికి తరలిస్తున్న సిబ్బంది

సోన్: సోన్ ఫారెస్ట్ చెక్‌పోస్ట్‌లో వాచర్‌గా పని చేస్తున్న సాగర్‌కు శుక్రవారం రోడ్డు ప్రమాదంలో గాయాలయ్యాయి. వివరాలు.. సోన్ మండల కేంద్రంలో గల ఫారెస్ట్ చెక్ పోస్ట్ వద్ద వాచర్‌గా విధులు నిర్వహిస్తున్న సాగర్ శుక్రవారం వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ఈ సమయంలో చెక్ పోస్ట్‌వద్ద ఆపకుండా వెళ్లిన వాహనాన్ని స్కూటీపై వెంబడించారు. ఈ క్రమంలో నిజామాబాద్ జిల్లా మెండోర మండలం బుస్సాపూర్ వద్ద సాగర్ స్కూటీతో కారును ఢీకొట్టారు. ఈ సమయంలో నిర్మల్ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న నిర్మల్ జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అల్లూరి మల్లారెడ్డి అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. వెంటనే స్పందించిన సిబ్బంది అంబులెన్స్‌లో నిర్మల్ ప్రభుత్వ ఆస్పత్రికి సాగర్‌ను తరలించారు.

ప్రమాదవశాత్తు చెరువులో పడి ఒకరి మృతి


రాంబాబు మృతదేహం

గుడిహత్నూర్: బంధువుల ఇంటికి వచ్చి ప్రమాదవశాత్తు చెరువులో పడి ఒకరు మృతి చెందారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇంద్రవెల్లి మండలంలోని శంకర్‌గూడ గ్రామానికి చెందిన బాలేరావ్ రాంబాబు (50) ముత్నూర్ గ్రామంలోని తన బంధువుల ఇంటికి వచ్చాడు. గురువారం ఉదయం మరో ఇద్దరు బంధువులతో కలిసి కాలకృత్యాలు తీర్చుకునేందుకు గ్రామ సమీపంలోని చెరువుకు వెళ్లాడు. ఈ క్రమంలో రాంబాబు స్నానం చేయడానికి చెరువులోకి దిగాడు. ప్రమాదవశాత్తు గల్లంతయ్యాడు. వెంట వచ్చిన వారు గమనించి గ్రామస్తులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న గ్రామస్తులు పలువురు చెరువులో దిగి వెతికినా ఫలితం దక్కలేదు. దీంతో పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టారు. సుమారు 4 గంటల తర్వాత మృతదేహాన్ని బయటకు తీసి పంచనామా నిర్వహించారు. పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఇమ్రాన్ సయ్యద్ తెలిపారు.

బల్దియా భవనం.. శిథిలమయం!

నిర్మల్ మున్సిపల్ కార్యాలయ భవనం శిథిలావస్థకు చేరింది. వర్షానికి గదుల గోడలు తడుస్తున్నాయి. పైకప్పు పెచ్చులూడుతోంది. కార్యాలయ సిబ్బందితోపాటు వివిధ పనులపై వచ్చేవారు భయాందోళనకు గురవుతున్నారు. దీని వెనుక 2010లో రూ.50 లక్షలతో నిర్మించిన భవనాన్ని వినియోగంలోకి తేవాలని కోరుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్



శిథిలమైన పాత భవనం


చైర్మన్ గది ముందు పైకప్పు ఇలా..


రెవెన్యూ విభాగం గదిలో..


వృథాగా నూతన భవనం

వర్షానికి కూలిన ఇంటి గోడ

దహెగాం: చినరాస్పెల్లి గ్రామానికి చెందిన రైతు రామగుండం సంజీవ్ ఇంటి గోడ గురువారం అర్ధరాత్రి కురిసిన భారీ వర్షానికి కూలింది. మరో గదిలో అందరూ నిద్రించిన సమయంలో ఈ ఘటన జరగగా ప్రమాదం తప్పింది. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

చెన్నూర్: పట్టణంలోని గోదావరి మూలమలుపు వద్ద జరిగన రోడ్డు ప్రమాదంలో కోటపల్లి మండలం బోరంపల్లి గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచ్ దుర్గం కుబేర్ (25) మృతి చెందాడు. కుబేర్ బోరంపల్లి నుంచి బైక్‌పై చెన్నూర్‌కు వస్తుండగా గోదావరి రోడ్డులో ఏర్పాటు చేసిన బారికేడ్లకు ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పిడుగుపాటుకు ప్రహరీ ధ్వంసం

నెన్నెల: మండల కేంద్రానికి చెందిన ముద్రకోల సదయ్య నూతన ఇంటి ప్రహరీపై గురువారం రాత్రి పిడుగుపడింది. గోడతో పాటు బోరు పైపులు పూర్తిగా ధ్వంసమయ్యాయి. రూ.4లక్షల వరకు నష్టం జరిగినట్లు బాధితుడు తెలిపాడు. పిడుగు పడినపుడు కుటుంబ సభ్యులు నలుగురు ఇంట్లో నిద్రిస్తున్నట్లు పేర్కొన్నాడు. డెప్యూటీ తహసీల్దార్ ప్రకాశ్, ఆర్ఐ గణేశ్ శుక్రవారం ఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు. ప్రభుత్వం స్పందించి పరిహారం అందించి ఆదుకోవాలని బాధితుడు కోరాడు.

అధికార వాహనం... అనధికార వినియోగం



ప్రభుత్వ వాహనాలను అధికారిక కార్యక్రమాల కోసమే వినియోగించాల్సి ఉండగా ఆదిలాబాద్ జిల్లాలోని కొందరు అధికారులు ప్రైవేట్ పనులకూ వినియోగిస్తున్నారు. తాజాగా ఇచ్చోడకు చెందిన అటవీశాఖ అధికారి తనకు అధికారిక పర్యటనల కోసం కేటాయించిన ప్రభుత్వ వాహనాన్ని ప్రైవేట్ పనుల కోసం వినియోగిస్తూ శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఓ మార్ట్ వద్ద 'సాక్షి' కెమెరాకు చిక్కారు. ఈయన ఒక్కరే కాదు జిల్లాలోని పలువురు అధికారులదీ ఇదే నిర్వాకం కావడం విమర్శలకు దారితీస్తోంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

వీక్లీ స్పెషల్ ట్రైన్‌ల గడువు పొడగింపు

- ఉత్తర్వులు జారీ చేసిన రైల్వేశాఖ
- వారణాసి వెళ్లేవారికి ప్రయోజనం

బెల్లంపల్లి: దానాపూర్–సికింద్రాబాద్/హైదరాబాద్ మధ్య ప్రవేశ పెట్టిన వీక్లీ స్పెషల్ ట్రైన్‌ల రాకపోకల గడువును పొడగిస్తూ రైల్వేశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. తాజాగా జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం వచ్చే ఆగస్టు 1వ తేదీ నుంచి క్రమంగా ఒక్కో స్పెషల్ ట్రైన్ రాకపోకలు యథావిధిగా కొనసాగనున్నాయి. వారాంతంలో మాత్రమే నడిచే ఆయా ప్రత్యేక రైళ్లకు రాష్ట్రంలోని కొన్ని ముఖ్యమైన జంక్షన్లు, స్టేషన్లతో పాటు మహారాష్ట్రలోని ఓ ప్రధాన జంక్షన్‌లోనూ హాల్టింగ్ కల్పించారు. వీక్లీ స్పెషల్ ట్రైన్‌ల రాకపోకలను పొడగించడంతో ఉత్తరాదిన ఉన్న కాశీ (వారణాసి) వెళ్లే భక్తులు, ప్రయాణికులకు ఎంతో సౌకర్యంగా ఉంటుంది. ప్రస్తుతం ఆయా వీక్లీ స్పెషల్ ట్రైన్‌లు కొంతకాలంగా రాకపోకలు సాగిస్తుండగా వాటిని మరికొన్ని నెలలపాటు నడిపించడానికి రైల్వే అధికారులు సానుకూల నిర్ణయం తీసుకున్నారు.

పొడగించిన స్పెషల్ ట్రైన్స్

- పాట్నా–సికింద్రాబాద్ (రైలు నంబర్ 03253) వీక్లీ స్పెషల్ ట్రైన్ రాకపోకలు సాగించే ప్రస్తుత కాలపరిమితి ఈనెల 31 చివ రి గడువు కాగా, కొత్తగా ఆగస్టు 5 నుంచి యథావిధిగా రాకపోకలు ప్రారంభించి ఆయా రైల్వేస్టేషన్లలో నిలుపుదలకు ఆదేశాలు జారీ అయ్యాయి. సెప్టెంబర్ 30 వరకు రాకపోకలు చేయడానికి గడువు పొడగించారు. సోమ, బుధ వారాల్లో ట్రైన్ నడుస్తుంది.
- హైదరాబాద్–పాట్నా (రైలు నంబర్ 07255) వీక్లీ స్పెషల్ ట్రైన్ ప్రస్తుతం రాకపోకలు సాగించే తుదిగడువు ఈనెల 31తో ముగుస్తుండగా, కొత్తగా అక్టోబర్ 2వరకు పొడగించారు. ఈ వీక్లీ స్పెషల్ ట్రైన్ ఆగస్టు 7నుంచి యథావిధిగా పునఃప్రారంభమవుతుంది. వారాంతంలో బుధవారం బయల్దేరుతుంది.
- సికింద్రాబాద్–పాట్నా (రైలు నంబర్ 07256) ఈ వీక్లీ స్పెషల్ ట్రైన్ ప్రస్తుత రాకపోకల గడువు ఆగస్టు 2వ తేదీతో ముగుస్తుండగా ఇది ఆగస్టు 9 నుంచి రాకపోకలు ప్రారంభిస్తుంది. తిరిగి సెప్టెంబర్ 27వ తేదీ వరకు రాకపోకలు సాగించడానికి గడువు పునరుద్ధరించారు. వారాంతంలో శుక్రవారం ఈ ట్రైన్ బయల్దేరి వెళ్తుంది.
- దానాపూర్–సికింద్రాబాద్ (రైలు నంబర్ 03225) స్పెషల్ ట్రైన్ ప్రస్తుత గడువు ఈనెల 25వ తేదీతో ముగుస్తుండగా, ఆగస్టు 1న ఈ ట్రైన్‌ను పునఃప్రారంభించి తిరిగి సెప్టెంబర్ 26వ తేదీ వరకు నడిపించడానికి ఆదేశాలు జారీ చేశారు. వారాంతంలో గురువారం ఈ స్పెషల్ ట్రైన్ నడుస్తుంది.
- సికింద్రాబాద్–దానాపూర్ (రైలు నంబర్ 03226) స్పెషల్ ట్రైన్ ప్రస్తుత కాల పరిమితి ఈనెల 28తో ముగుస్తుంది. కొత్తగా ఆగస్టు 4 నుంచి రాకపోకలు పునఃప్రారంభిస్తుంది. సెప్టెంబర్ 29 వరకు నడిపించడానికి గడువు పొడగించారు. కాగా, ఈ ట్రైన్ వారాంతంలో ఆదివారం మాత్రమే బయల్దేరుతుంది.

హాల్టింగ్ కల్పించిన స్టేషన్లు

వీక్లీ స్పెషల్ ట్రైన్‌లకు పలు ముఖ్యమైన జంక్షన్లు, స్టేషన్లలో నిలుపుదలకు అవకాశం కల్పించారు. సికింద్రాబాద్, కాజీపేట్ జంక్షన్, పెద్దపల్లి జంక్షన్‌తో పాటు బెల్లంపల్లి, సిర్పూర్ కాగజ్‌నగర్ స్టేషన్లలో నిలుపుదలకు ఆదేశాలు వెలువడ్డాయి. మహారాష్ట్రలోని బల్లార్షా జంక్షన్‌లోనూ ఆయా ప్రత్యేక రైళ్లు ఆగుతాయని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

ఐడియా పోటీలు నిర్వహించాలి

మంచిర్యాలఅర్బన్: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులకు ఐడియా పోటీలు తప్పకుండా నిర్వహించాలని డీఈవో యాదయ్య ఆదేశించారు. శుక్రవారం పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులకు ఇన్‌స్పైర్ మనాక్‌పై జూమ్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల వినూత్న ఆలోచనలకు వేదిక ఇన్‌స్పైర్ మనాక్ అని పేర్కొన్నారు. 2024–25 సంవత్సరానికి నామినేషన్లు ప్రారంభమైనట్లు తెలిపారు. సెప్టెంబర్ 15 తుదిగడువు కాగా, ప్రతీ పాఠశాల నుంచి ఐదు నామినేషన్లు ఆగస్టు 30లోపు పూర్తి చేయాలని సూచించారు.